సాక్షి
సిద్దిపేట
శనివారం । 12 । ఆగస్టు । 2023



బాల్యం.. ఇక భద్రం
పనిలో మగ్గుతున్న బాలలకు విముక్తి కల్పించేందుకు నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ సత్ఫలితాలిస్తుంది. బాలల మోముల్లో చిరునవ్వులు పూయిస్తోంది. 10లో..



వివరాలు అడిగి.. డబ్బులు కాజేసి..
పోగొట్టుకున్న డబ్బును ఎలా రాబట్టుకోవాలని ఆన్‌లైన్‌లో శోధిస్తున్న క్రమంలో సైబర్ వలలో పడి బాధితుడు మరింత డబ్బు పోగొట్టుకున్నాడు. 10లో..

ఇప్పటి వరకు 348 'మద్యం' దరఖాస్తులు
సిద్దిపేటకమాన్: జిల్లాలోని మద్యం దుకాణాలకు శుక్రవారం వరకు 348 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి తెలిపారు. జిల్లాలో 93 మద్యం దుకాణాలకు సిద్దిపేట సర్కిల్లో 100, గజ్వేల్ సర్కిల్లో 14, హుస్నాబాద్ సర్కిల్‌లో 42, చేర్యాల సర్కిల్‌లో 32, మిరుదొడ్డి సర్కిల్‌లో 26 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

దుబ్బాక ఆస్పత్రి మరో రికార్డు

- ఓపీ సేవల్లో రాష్ట్రంలోనే ప్రథమస్థానం
- హర్షం వ్యక్తం చేసిన వైద్యబృందం

దుబ్బాకటౌన్: స్థానిక ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రి మరో రికార్డు సాధించింది. ఇప్పటికే అత్యుత్తమ వైద్యసేవలతో అనేక అవార్డులు అందుకుంది. తాజాగా ఓపీ వైద్యసేవల్లో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవడం విశేషం. జూలై మాసంలో 94 శాతం మేర వైద్య సేవలు అందించడంతో ఈ ఘనత సాధించింది. మొత్తం 2,831 మంది ఓపీ రిజిస్ట్రేషన్ చేసుకోగా 2,649 మందికి వైద్య సేవలు అందించారు. అగ్రస్థానంలో నిలవడంతో ఆస్పత్రి వైద్యబృందానికి వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు ప్రశంసలు అందించారు. ఈ మేరకు శుక్రవారం ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్ వైద్యులు, వైద్యసిబ్బంది, ఓపీ రిజిస్ట్రేషన్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

చాలా సంతోషంగా ఉంది



ఓపీ వైద్యసేవల్లో దుబ్బాక ఆస్పత్రి ప్రథమ స్థానంలో నిలవడం చాలా సంతోషంగా ఉంది. వైద్యులు, సిబ్బంది చేసిన కృషి ఫలితమే ఇది. ఇదే స్ఫూర్తితో ప్రతినెలా కొనసాగిస్తాం.
– డాక్టర్ హేమరాజ్‌సింగ్, ఆస్పత్రి సూపరింటెండెంట్



దుబ్బాక ఆస్పత్రిలో వైద్యబృందాన్ని అభినందిస్తున్న సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్

న్యూస్‌రీల్

14న తేనెటీగల పెంపకంపై సెమినార్

ములుగు(గజ్వేల్): ములుగు అటవీ కళాశాల పరిశోధన కేంద్రం (ఎఫ్‌సీఆర్ఐ)లోని ఆడిటోరియంలో ఈ నెల 14న శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై రాష్ట్రస్థాయి సెమినార్‌ను నిర్వహించనున్నట్లు కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తేనెటీగల పెంపకంతో పాటు ఉపాధికల్పన కోసం అవగాహన కల్పించేందుకు సెమినార్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఆసక్తి గల రైతులు శశాంక్ 83097 35959, నరేష్ 9849810511 నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎస్‌ఓ, ఉపాధ్యాయుల రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శుక్రవారం నిర్వహించారు. సిద్దిపేట మండల విద్యాశాఖ కార్యాలయంలో పరిశీలన కొనసాగింది. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో అధికారులు, అభ్యర్థులకు సంబంధించిన సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ జిల్లాలో కేజీబీవీ, యూఆర్ఎస్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 36 పోస్టులకు గతంలో రాత పరీక్ష నిర్వహించామని, అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను మూడు దశల్లో పరిశీలించామన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు రామస్వామి, రంగనాథ్, ముక్తేశ్వరి, వివిధ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ సాధనే లక్ష్యం

- నేడు నగరంలో జరిగే బహిరంగ సభకు తరలిరండి
- సీపీఎస్‌ఈయూ నేతల పిలుపు



మాట్లాడుతున్న సీపీఎస్‌ఈయూ నేతలు మల్లికార్జున్, శ్రీనివాస్ తదితరులు

గజ్వేల్: పాత పెన్షన్ సాధనే లక్ష్యంగా హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ(తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్) రాష్ట్ర ఉపాధ్యక్షులు కురాకుల శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై 16న రథయాత్రను ప్రారంభించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సభలు, సమావేశాలు, రోడ్‌షోలు నిర్వహించడం ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయులను సంఘటితం చేసినట్లు తెలిపారు. ముగింపు సందర్భంలో నగరంలో సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఇప్పటికే ఆరు రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారని, అదే తరహాలో తెలంగాణలోనూ సీఎం కేసీఆర్ చొరవ చూపాలని కోరారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు నిర్వహిస్తున్న ఈ సభకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ నాయకులు పాల్గొన్నారు.

అత్యాధునిక టెక్నాలజీతో కేన్సర్‌కు చికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ గణేశ్

సిద్దిపేటకమాన్: అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి బ్లడ్ కేన్సర్ వ్యాధిని నయం చేయవచ్చని హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ గణేశ్ జైషెట్‌వాల్ అన్నారు. బ్లడ్ కేన్సర్ బారిన పడి చికిత్స అందించిన అనంతరం కోలుకున్న వారితో కలిసి శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. డాక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు మూడేళ్ల క్రితం బ్లడ్ కేన్సర్ బారిన పడ్డారని వారికి అత్యాధునిక టెక్నాలజీ సాయంతో బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీ చేయడంతో తిరిగి కోలుకున్నారని తెలిపారు. కేన్సర్ వ్యాధికి మనోధైర్యాన్ని మించిన వైద్యం మరొకటి లేదని అన్నారు. ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



అక్కారంలో ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటగా సాగవుతున్న అరటిని పరిశీలిస్తున్న మంత్రి హరీశ్

- బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి
- బండమైలారంలో రూ.1200కోట్లతో కోకాకోలా పరిశ్రమ
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకుసాగుతన్నదని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని పీఎస్ఆర్ గార్డెన్స్‌లో బీసీ బంధు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆ తర్వాత కోలా అభిరామ్ గార్డెన్స్‌లో మంత్రి సమక్షంలో నియోజకవర్గంలోని వర్గల్, జగదేవ్‌పూర్ మండలాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు ప్రసంగిస్తూ వృత్తులను నమ్ముకొని జీవనం సాగిస్తున్న బీసీలకు చేయూతనివ్వడమే లక్ష్యంగా 'బీసీ బంధు' ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఎలాంటి బ్యాంకు షూరిటీలతో ప్రమేయం లేకుండా ఉచితంగా రూ.లక్ష సాయం అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. బీసీ సంక్షేమం పట్ల గత ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తే కేసీఆర్ మాత్రం వారిని అక్కున చేర్చుకుంటున్నారని తెలిపారు. అభివృద్ధిని సైతం అదే తరహాలో ముందుకుతీసుకెళ్తున్నట్లు స్పష్టం చేశారు. ములుగు మండలం బండ మైలారంలో రూ.1200కోట్ల వ్యయంతో కోకకోలా కంపెనీ ఏర్పాటు కాబోతున్నదన్నారు. దీని ద్వారా వెయ్యికి మందికిపైగా ఉపాధి లభించనున్నదని వెల్లడించారు. వర్గల్‌లో ఏర్పాటవుతున్న ఫుడ్ పార్కులో, తున్కిబొల్లారం టీఎస్ఐఐసీ ఇండస్ట్రియల్ పార్కుల్లో పరిశ్రమల స్థాపన వేగవంతమవుతోందని వెల్లడించారు. ఇంకా ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ రోజాశర్మ, 'గడా' ప్రత్యేకాధికారి ముత్యం రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఎంపీపీ అమరావతి, రైతు బంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దేవీ రవీందర్, బీఆర్ఎస్ గజ్వేల్ మండల శాఖ అధ్యక్షులు బెండె మధు, గజ్వేల్ పట్టణ శాఖ అధ్యక్షులు నవాజ్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

అంతరపంటల పరిశీలన

గజ్వేల్ మండలం అక్కారంలో పదెకరాల్లోని ఆయిల్‌పామ్ తోట అందులోని అంతర పంటగా సాగవుతున్న అరటి తోటను మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు తోట లక్ష్మణ్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సాగుతో మంచి ఫలితాలు పొందుతున్నానని రైతు చెప్పడంతో మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని రైతులు అంతర పంటలు సాగుతో అభాలు గడిస్తున్నారని చెప్పారు. రైతుల అవసరాల కోసం నంగునూర్ మండలం నర్మెట్టలో రూ.300కోట్లతో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

సరదా ఫీట్లు.. తెస్తున్న పాట్లు

- జగదేవ్‌పూర్ మండల కేంద్రానికి చెందిన మిట్టపల్లి వెంకటేశం, అనిత దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. అలిరాజ్‌పేటలోని ప్రైవేటు పాఠశాలలో కుమారుడు అఖిల్ పదో తరగతి చదువుతున్నాడు. ప్రత్యేక తరగతుల కోసం ఈ నెల 9న ఉదయం బైక్ పై పాఠశాలకు బయలుదేరాడు. అలిరాజ్‌పేట శివారులోకి రాగానే లారీ బైక్‌ను ఢీకొంది. దీంతో అఖిల్ అక్కడికక్కడే మృతిచెందాడు.
- జూలై 13న నర్సాపూర్‌కు చెందిన గిరి, అరుణ దంపతుల కుమారుడు శ్రీమాన్(16) తన స్నేహితుడు దివేంద్రతో కలిసి బైక్ పై వెళ్తుండగా ముస్తాబాద్ చౌరస్తా సమీపంలోని నిమ్రా గార్డెన్ వద్ద ఆటోను ఢీకొన్నారు. దీంతో అక్కడికక్కడే శ్రీమాన్ మృతి చెందగా గాయాలైన దివేంద్రను ఆస్పత్రికి తరలించారు. శ్రీమాన్‌కు ఇటీవలే కొత్తగా బైక్ కొనిఇచ్చారు.

చిన్నారుల డేంజర్ రైడ్

- రోడ్లపై మైనర్ల బైక్ విన్యాసాలు
- నెలరోజుల్లోనే ఇద్దరు మృత్యువాత
- కన్నోళ్లకు కడుపుకోత
- అధికారులు చర్యలు చేపడుతున్నా కానరాని ఫలితం



బైక్‌లు నడుపుతున్న మైనర్లు (ఫైల్)

సాక్షి, సిద్దిపేట: మైనర్లు రోడ్డెక్కితే చాలు బైక్‌లను రయ్ రయ్ మంటూ నడిపేస్తున్నారు. వెనుకా ముందు చూసుకోకుండా ఖాళీగా చేతులు వదిలేసి బైక్‌లు నడపడం, బైక్‌లపై నిల్చొని ప్రయాణిస్తూ ఒళ్లు గగుర్పొడిచేలా విన్యాసాలు చేస్తున్నారు. కొంతమంది తల్లిదండ్రులకు మస్కా కొట్టి బైకులు నడుపుతుండగా, మరికొంతమంది తల్లిదండ్రులే బైక్ కొనిచ్చి పంపిస్తున్నారు. మైనర్ల డ్రైవింగ్ ప్రాణాలమీదకు వస్తోంది. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలే ఇందుకు నిదర్శనం. నెల రోజుల్లో ఇద్దరు మైనర్లు బైక్ నడుపుతూ రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడ్డారు.

వచ్చీరాని డ్రైవింగ్ వల్లే..

చాలా మంది మైనర్లు డ్రైవింగ్ రాకున్నా వాహనాలు నడుపుతున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. ప్రమాదకరం కూడా.. చాలా మంది పిల్లలు, వారి తల్లిదండ్రులు ఈ ముప్పును గ్రహించలేక పోతున్నారు. అతిగారాబం, పిల్లలకు ఏ లోటు లేకుండా చూడాలనే ఆలోచనతో చేతికి బండి ఇస్తున్నారు. వచ్చీరాని డ్రైవింగ్‌తో విన్యాసాలు చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఎక్కువగా అదుపు తప్పి ఎదురుగా ఉన్న వ్యక్తిని ఢీ కొట్టడం, తనకు తానుగా పడిపోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. వీటిలో అధిక శాతం పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లడం లేదు. చిన్న పిల్లలు కదా స్టేషన్‌కు వెళితే కేసు అవుతుందనే ఉద్దేశంతో రాజీ చేసుకుంటున్నారు. మరికొన్ని ఘటనలు పోలీసుల వరకు వెళ్లినా పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఇరు వర్గాలకు రాజీ మార్గమే చూపుతున్నారు.

186 మందికి జరిమానాలు

డ్రైవింగ్ చేస్తున్న మైనర్లకు జరిమానాలు విధించడంతోపాటు తల్లితండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 186 మందికి ఎంవీ యాక్టు ప్రకారం జరిమానాలను వేశారు. లైసెన్స్ లేకుండా ఇతరుల వాహనం నడిపి ప్రమాదాలు చేస్తే వాహనం ఎవరి పేరు మీద రిజిస్టర్ అయి ఉందో వారిపై కూడా కేసు నమోదు చేస్తారు. యాక్సిడెంట్ చేసిన వారితో పాటు వాహనం ఇచ్చిన వారు, రిజిస్ట్రేషన్ చేసుకోకుండా అమ్మిన వ్యక్తిపై కూడా కేసులు పెడతారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



మైనర్లకు తల్లిదండ్రులు బైక్‌లు, కార్లు ఇవ్వవద్దు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే జరిమానాలు విధించి, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. మైనర్ల డ్రైవింగ్ వల్ల జరిగే అనర్థాల గురించి పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతి ఒక్కరూ రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలి.
– శ్వేత, సీపీ

మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం



రోగుల వివరాలు సేకరిస్తున్న వైద్యాధికారి కాశీనాథ్

చిన్నకోడూర్(సిద్దిపేట): ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిరంతరం పర్యవేక్షణతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని ఎంహెచ్‌ఓ కాశీనాథ్ తెలిపారు. శుక్రవారం గోనెపల్లి గ్రామాన్ని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డితో కలిసి సందర్శించి మధుమేహ వ్యాధి గ్రస్తులు, బీపీ పేషంట్ల వివరాలు సేకరించారు. అనంతరం పాలియేటీవ్ కేర్ సేవలు పొందుతున్న రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ ఆరోగ్యశాఖ ద్వారా ఆస్పత్రుల్లో వైద్య సేవలను మరింత మెరుగు పరిచామన్నారు. నిరంతర పర్యవేక్షణలో రోగులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామన్నారు. ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలను గ్రామస్తులకు వివరించాలని డీఎంహెచ్‌ఓ కాశీనాథ్ ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వరూప, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్లాస్టిక్ ప్యాడ్లతో కేన్సర్, థైరాయిడ్'

నంగునూరు(సిద్దిపేట): మెన్సెస్ కప్పులు మహిళలకు రక్షణ కవచంలా పని చేస్తాయని పోలీస్ కమిషనర్ శ్వేత, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. శుక్రవారం వెంకటాపూర్, మగ్దుంపూర్, అప్పలాయిచెర్వు గ్రామాల్లో రుతు చక్రం, మెన్సెస్ కప్పుల వాడకం, ప్లాస్టిక్ ప్యాడ్ల వాడకం వల్ల వచ్చే వ్యాధులపై డాక్టర్ శాంతి అవగాహన కలించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్, అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలకు రుతుచక్రంపై అవగాహన కలిప్ంచేందుకు ప్రతి గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్లాస్టిక్ ప్యాడ్ల వాడకం వల్ల కేన్సర్, థైరాయిడ్ వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డీపీఓ దేవకిదేవి, సర్పంచ్‌లు బాగ్యలక్ష్మి, అజీద్, మల్లవ్వ, ఎంపీటీసీ బాబు తదితరులు పాల్గొన్నారు.

సోలిపేట కుటుంబానికి టికెట్ వచ్చేనా?



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

- అనుచరులతో రామలింగారెడ్డి సతీమణి, కుమారుడు సమావేశం
- భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు
- సర్వత్రా చర్చనీయాంశం

దుబ్బాకటౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ సోలిపేట కుటుంబానికి బీఆర్ఎస్ టికెట్ ఇచ్చే విషయమై చర్చ జరుగుతోంది. శుక్రవారం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ యువ నాయకులు, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే తమ అనుచరులతో దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి సతీమణి సుజాత, కుమారుడు, బీఆర్ఎస్ రాష్ట్రనాయకులు సతీష్‌రెడ్డి సిద్దిపేటలోని ఓ ఫంక్షన్ హాలులో సమావేశం కావడం హాట్ టాఫిక్‌గా మారింది. అసెంబ్లీ టికెట్ సోలిపేట కుటుంబానికా? లేక ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికా? అనే విషయమై కొన్ని నెలలుగా చర్చ జరుగుతోంది. రామలింగారెడ్డి అనారోగ్యంతో మరణించడంతో జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన సతీమణి కేవలం వెయ్యి పైచిలుకు ఓట్ల తేడాతో ఓటమి చెందడం.. బీజేపీ నుంచి పోటీచేసిన రఘునందన్‌రావు ఎమ్మెల్యేగా గెలుపొందండం విదితమే. బీఆర్ఎస్‌కు పట్టు ఉన్న దుబ్బాకలో ఏవరూ ఊహించని రీతిలో బీజేపీ నుంచి రఘునందన్‌రావు గెలుపొందడంతో రాష్ట్ర రాజకీయాల్లో పెనుసంచలనంగా మారింది. దీంతో అప్పటి నుంచి బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర నిరుత్సాహం నెలకొంది. ఓడిపోయినప్పటికీ పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ వారి కష్ట సుఖాల్లో సుజాత, కుమారుడు సతీష్‌రెడ్డి పాలు పంచుకుంటూ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు.

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సైతం..

మరో వైపు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి నియోజకవర్గంలో అన్ని తానై పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటున్నారు. పెద్ద ఎత్తున నిధులు తెచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈసారి దుబ్బాక అసెంబ్లీ టికెట్ కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఇస్తారని, నియోజకవర్గం బాధ్యతలు చూసుకోవాలంటూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు సూచించడంతో ఎంపీ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇదిలా ఉంటే, ఈ సారి రామలింగారెడ్డి కుమారుడు సతీష్‌రెడ్డికి ఇస్తారంటూ కూడా ప్రచారం జరుగుతోంది.ఈ క్రమంలోనే దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి సతీమణి సిద్దిపేటలో నిర్వహించిన ప్రత్యేక సమావేశం నియోజకవర్గంలో తీవ్ర చర్చానీయాంశంగా మారింది. సమావేశంలో ఏం మాట్లాడారో బయటకు తెలియనప్పటికీ ఈ సారి తప్పకుండా మనకే టికెట్ వస్తుందని ఈ సారి భారీ మెజార్టీతో గెలుపొందాలని అందుకు మీరు గట్టిగా పనిచేయాలని కోరినట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో ఈ సమావేశం తీవ్ర వైరల్ అయ్యింది. నియోజకవర్గంలోని ముఖ్యనాయకులకు సమచారం లేకున్నా 200 మందికి పైగా యాక్టివ్ కార్యకర్తలు పాల్గొన్నట్లు తెలిసింది. తమకు తెలియదని తామకు తెలిసి ఉంటే వెళ్లేవారమని చాలా మంది సక్తిగా చర్చించుకోవడం కనిపించింది. ఏదేమైనా ఈ రోజు జరిగిన సమావేశం నియోజక వర్గంలో తీవ్ర చర్చానీయాంశంగామారింది.



ప్రతి ఇంటా తిరంగా.. ఎగరాలి ఘనంగా

హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సిద్దిపేటలోని హెడ్ పోస్టాఫీస్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు పోస్టల్ సిబ్బంది జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్ట్ మాస్టర్ శ్రీనివాస్, పోస్టల్ సబ్ డివిజన్ హెడ్ కేఈ జోయల్ మాట్లాడుతూ ప్రజల్లో జాతీయ భావం పెంపొందించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రజలందరూ ఆగస్టు 15న తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. అన్ని పోస్టాఫీసుల్లోనూ జాతీయ జెండాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు.
– సిద్దిపేటకమాన్

క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీ: ఒకరి మృతి

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన పటాన్ చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం.. పట్టణం లోని నర్రబస్తీకి చెందిన సత్యనారాయణ (53) జీహెచ్ఎంసీ వాటర్ సప్లయర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం సైకిల్‌పై పటాన్‌చెరు శివారులోని తన పొలం వద్దకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. మధ్యాహ్న భోజనానికి ఇంటికి రాకపో వడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. ఎంతకీ తీయకపోవడంతో అనుమానం వచ్చి పొలం వద్ద వెళ్లి చూడగా రోడ్డు పక్కన గాయాలతో మృతిచెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ..

పటాన్‌చెరు టౌన్: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందిన సంఘటన పటాన్ చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. పట్టణం లోని శాంతినగర్ కాలనీలో రామకృష్ణ తన భార్య సుధారాణి (28)తో కలిసి నివాసం ఉంటున్నాడు. రామకృష్ణ హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం తన ఉద్యోగానికి వెళ్లాడు. అయితే భార్య సుధారాణి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. గుర్తుతెలియని వ్యక్తి ఆమె మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చి, కారు పార్క్ చేసి వస్తానని చెప్పి ఉడాయించాడు. అయితే కుటుంబ సభ్యులు మాత్రం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో జారి పడి..


ప్రభాకర్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): ఇంట్లో జారిపడి యువకుడు మృతిచెందాడు. ఈసంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన పాశం ప్రభాకర్ యాదవ్ (29) ఇంట్లో జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, తదితరులు సంతాపం ప్రకటించారు. మృతుడికి భార్య సరిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేట కమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానాతో పాటు ఇద్దరికి జైలు శిక్ష విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో తమ సిబ్బందితో కలిసి నాలుగు రోజుల క్రితం వాహనాల తనిఖీ చేపట్టగా 8 మంది మద్యం తాగి వాహనాలను నడుపుతూ పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా విచారణ జరిపిన జడ్జి ఎనిమిది మందికి రూ. 17,500 జరిమానాతో పాటు వీరిలో ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.



ఔను... చట్టం పోలీసులకు చుట్టమే..!



చట్టం ముందు అందరూ సమానం అంటారు. మరి.. ఆ చట్టమే కొందరికి చుట్టమైతే.. ఇదిగో ఈ ఫొటోనే సాక్ష్యం. సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఫోన్ చేస్తూ వాహనాలను నడుపుతున్న వారిని ఆపి జరిమానా విధిస్తున్నారు. అదే సమయంలో పోలీసు వాహనంలో ఫోన్ చేస్తూ డ్రైవింగ్ చేస్తున్నా చూసీ చూడనట్లుగా వ్యవహరించారు. ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది. ఔను మరి.. చట్టం కొందరికి చుట్టమే కదా? అని అక్కడున్న వారు చర్చించుకోవడం కనిపించింది.

- సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

వివరాలు అడిగి.. డబ్బులు కాజేసి..



పటాన్‌చెరు టౌన్: పోగొట్టుకున్న డబ్బును ఎలా రాబట్టుకోవాలని ఆన్‌లైన్‌లో శోధిస్తున్న క్రమంలో సైబర్ వలలో పడి బాధితుడు మరింత డబ్బు పోగొట్టుకున్నాడు. ఈసంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధి బీహెచ్ఈఎల్ మెట్రో ఎన్‌క్లేవ్‌కు చెందిన వ్యక్తి ఫోన్‌కు గురువారం ఒక లింక్ వచ్చింది. క్లిక్ చేయగా తన ఖాతా నుంచి రూ. 1,499 కట్ అయ్యాయి. దీంతో బాధితుడు పోగొట్టుకున్న నగదును తిరిగి రాబట్టేందుకు ఆన్‌లైన్‌లో శోధిస్తున్న క్రమంలో ఓ ఫోన్ నంబర్ దొరికింది. ఆ నంబర్ ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పాడు. ఇదే అదునుగా భావించిన అపరిచితుడు అతడి ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకొని ఖాతా నుంచి రూ. 93,000 మాయం చేసి బురిడీ కొట్టించాడు. మోసపోయినట్టు గుర్తించిన బాధితుడు ముందుగా సైబర్ క్రైం పోలీసులకు.. శుక్రవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బులు ఫ్రీజ్..

మిరుదొడ్డి(దుబ్బాక): సైబర్ నేరగాడి నుంచి రూ. 90 వేలను పోలీసులు ఫ్రీజ్ చేశారు. ఎస్ఐ భువనేశ్వర్‌రావు శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భూంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిని పోతారెడ్డిపేటకు చెందిన యాదగిరి తన ఫోన్‌లో ఓ యాప్‌ను ఇన్‌స్టాల్ చేశాడు. తన కాంటాక్టును యాక్సెస్ చేయడానికి గుర్తు తెలియని సైబర్ నేరగాడు బాధితుడికి వివిధ రుణయాప్‌ల నుంచి మొత్తం రూ. 90 వేలు క్రెడిట్ చేశాడు. అనంతరం మొత్తం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిత్యం ఫోన్ కాల్ చేస్తూ బాధితుడిని నిత్యం వేధిస్తున్నాడు. లేదంటే ఫొటోలు న్యూడ్‌గా తయారు చేసి కాంటాక్టుల్లో ఉన్న అన్ని నంబర్లకు పంపిస్తానని బ్లాక్‌మెయిల్ చేశాడు. దీంతో అనుమానం వచ్చిన బాధితుడు వెంటనే 1930కు ఫోన్ చేసి వివరాలు తెలిపాడు. వారు వెంటనే రూ. 90 వేలు ఫ్రీజ్ చేసినట్టు తెలిపారు.

మహిళ మృతదేహం లభ్యం

హత్యగా అనుమానం.. పోలీసుల దర్యాప్తు


లక్ష్మి (ఫైల్)

రామాయంపేట(మెదక్): మండలంలోని శివ్వాయపల్లి గ్రామ శివారు బాలసముద్రం వద్ద మహిళ మృతదేహాన్ని శుక్రవారం గ్రామస్తులు గుర్తించారు. పశువుల కాపరులు కొందరు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందజేశారు. మృతిచెందిన మహిళ మండలంలోని దామరచెరువుకు చెందిన కుస్తి లక్ష్మి (45)గా నిర్ధారించారు. మృతురాలి తలపై బలమైన గాయాలు ఉండడంతో హత్యగా అనుమానిస్తున్నారు. క్లూస్ టీం, డాగ్‌స్కాడ్ బృందం సంఘటనాస్థలిలో వివరాలు సేకరించారు. సీఐ లక్ష్మీబాబు, ఎస్ఐ–2 రాంచందర్ ఘటనాస్థలిని సందర్శించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాల్యం.. ఇక భద్రం

● సత్ఫలితాలిస్తున్న 'ఆపరేషన్ ముస్కాన్' ● జిల్లాలో 48 మంది పిల్లలను కాపాడిన అధికారులు


'ఆపరేషన్ ముస్కాన్' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ శ్వేత, అధికారులు (ఫైల్)

సిద్దిపేటకమాన్: పనిలో మగ్గుతున్న బాలలకు విముక్తి కల్పించేందుకు నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ సత్ఫలితాలిస్తుంది. బాలల మోముల్లో చిరునవ్వులు పూయిస్తూ బడిబాట పట్టిస్తోంది. జిల్లాలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్‌లో 12 హాట్ స్పాట్లను గుర్తించి ప్రత్యేక నిఘా పెట్టారు. పోలీస్, శిశుసంక్షేమ, కార్మికశాఖ అధికారులు సంయుక్త తనిఖీలు చేపట్టారు. 18 ఏళ్లలోపు ఇద్దరు పిల్లలను గుర్తించి, పనిలో పెట్టుకున్న వారిపై కేసులు నమోదు చేశారు. అదేవిధంగా ఇటుక బట్టీలు, హోటళ్లు, ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న 48 మంది పిల్లలను గుర్తించి సీడబ్ల్యూసీ ఎదుట హాజరు పర్చారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి అనంతరం వారికి అప్పగించారు.

మూడు డివిజన్ల ఏర్పాటు

సిద్దిపేట అడిషనల్ డీసీపీ అడ్మిన్ అధికారి ఆధ్వర్యంలో జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ కోసం సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ మూడు డివిజన్లలో పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించారు. ఏడాదిలో రెండుసార్లు జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో వివిధ శాఖల అధికారుల సమన్వయంతో పోలీస్ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు. వెట్టి చాకిరీ చేస్తున్న పిల్లలను గుర్తించి వారికి పని నుంచి విముక్తి కల్పిస్తున్నారు. అదేవిధంగా పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలకు పంపేలా అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులను పనిలో పెట్టుకున్నా, వారితో వెట్టి చాకిరీ చేయిస్తున్నా డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూం 8712667100 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచిస్తున్నారు. అదేవిధంగా పిల్లలను పనిలో పెట్టుకునే నిర్వాహకులకు జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

పిల్లలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. జిల్లాలో జూలై 1 నుంచి 31 వరకు బాలల సంరక్షణ, ఇతర శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించి 48 మంది పిల్లలకు విముక్తి కల్పించాం.

– ఎన్. శ్వేత, సిద్దిపేట పోలీస్ కమిషనర్

అనుమానాస్పద స్థితిలో కార్యదర్శి మృతి


గదిలో విగతజీవిగా పడి ఉన్న శంకర్

నారాయణఖేడ్: అనుమానాస్పద స్థితిలో పంచాయతీ కార్యదర్శి మృతి చెందాడు. ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి కథనం ప్రకారం.. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం చేవెళ్లకు చెందిన బస్‌లింగయ్య, భూమమ్మ దంపతుల కుమారుడు శీలంకోటి శంకర్ (32) నాలుగున్నరేళ్లుగా నారాయణఖేడ్ మండలంలోని పంచగామ పంచాయతీ కార్యదర్శిగా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ ప్రాంతంలోనే పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సుదర్శన్‌గౌడ్‌తో కలిసి నారాయణఖేడ్‌లోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్నాడు. సుధాకర్‌గౌడ్ గురువారం సొంతూరికి వెళ్లగా శంకర్ విధులు ముగించుకుని రాత్రి ఇంట్లో నిద్రించాడు. శుక్రవారం ఉదయం గది తలుపులు తెరవకపోవడంతో ఇంటి యజమాని తలుపుకొట్టగా స్పందించలేదు. ఫోన్ చేసినా తీయకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు సిబ్బంది సహాయంతో తలుపులు పగులగొట్టి చూడగా శంకర్ విగతజీవిగా పడి ఉన్నాడు. కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో వారు నారాయణఖేడ్‌కు చేరుకుని బోరున విలపించారు. ఫిట్స్‌తో మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. గతేడాది శంకర్‌కు నిశ్చితార్థం జరుగుతుండగా వేదికపైనే ఫిట్స్ రావడంతో వివాహం రద్దయిందని చెప్పారు.

కూలికి వెళ్లి.. బావిలో శవమై..


నిరంజన్ మృతదేహం

కొండాపూర్(సంగారెడ్డి): ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతిచెందిన సంఘటన అనంతసాగర్ గ్రామ శివారులో జరిగింది. ఏఎస్సై సూర్య కథనం ప్రకారం.. మండల పరిధిలోని మారెపల్లికి చెందిన దాసరి నిరంజన్ (28) కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఈక్రమంలో గ్రామ శివారులో గల రైతు పూలేందర్‌రెడ్డి వ్యవసాయ బావిలో పైపులు తీసేందుకు గురువారం వెళ్లాడు. సాయంత్రం బావి నుంచి పైపులు తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందాడు. శుక్రవారం మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

పిల్లర్ గుంతలో పడి వ్యక్తి మృతి


గుంతలో శ్రీనివాస్ మృతదేహం

వర్గల్(గజ్వేల్): ప్రమాదవశాత్తు పిల్లర్ గుంతలో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని నాచారంలో శుక్రవారం జరిగింది. గౌరారం ఎస్సై విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండ్ల శ్రీనివాస్(29)కు భార్య స్రవంతి, అయిదేళ్లలోపు లాస్య, కార్తీక్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తుండగా.. దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గురువారం మధ్యాహ్నం శ్రీనివాస్ బయటకు వెళ్తున్నట్టు ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. శుక్రవారం గ్రామంలో రోడ్డు పక్కన ఇంటి నిర్మాణం కోసం తీసిన పిల్లర్ గుంతలో శవమై కన్పించాడు. గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగి ఉండడంతో గుంత కనబడక ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెంది ఉంటాడని కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు చోట్ల ఐదుగురు అదృశ్యం


వడ్డె ఎల్లమ్మ


రాణమ్మ


వరుణ్


వైజ్యనాథ్

జహీరాబాద్ టౌన్: ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అదృశ్యమైన సంఘటన మొగుడంపల్లి మండలంలోని గుడ్‌పల్లిలో జరిగింది. చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్డె ఎల్లమ్మ ఆమె కూతురు రాణమ్మ ఆమె ఇద్దరు పిల్లలు వరుణ్, వైజ్యనాథ్ ఈనెల 6వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లారు. తిరిగి ఇంటికి రాకపోవడంతో వడ్డె ఎల్లమ్మ కుమారుడు గోపాల్ తెలిసిన వారు బంధువుల వద్ద వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భారతీనగర్ డివిజన్ పరిధిలో


సాయినాథ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): యువకుడు అదృశ్యమైన సంఘటన భారతీనగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన సాయినాథ్ ఏ పని చేయకుండా ఇంట్లో ఖాళీగా ఉండేవాడు. ఈ విషయంపై అతని తండ్రి ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీన మందలించాడు. దీంతో సాయినాథ్ అదేరోజు మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. తిరిగి వస్తాడని కుటుంబ సభ్యులు ఎదురు చూశారు. రాకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రూ. లక్ష నగదు, బంగారం, వెండి ఆభరణాలు అపహరణ

శివ్వంపేట(నర్సాపూర్): తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి నగదు, బంగారం అపహరించారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని చెన్నాపూర్‌కు చెందిన సింగిరెడ్డి విఠల్‌రెడ్డి గురువారం ఆస్పత్రికి వెళ్లగా.. అతడి భార్య, తల్లి పొలం వద్దకు వెళ్లారు. గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు బాత్‌రూంలో దాచిపెట్టిన తాళం చెవిని తీసుకొని ఇంట్లోకి చొరబడ్డారు. రూ. లక్ష నగదు, నాలుగున్నర తులాల బంగారం, 15 తులాల వెండి ఆభరణాలతో పాటు ఇంట్లో ఉన్న సెల్‌ఫోన్‌ను చోరీ చేశారు. అనంతరం ఇంటికి తాళం వేసి ఎక్కడి తాళం చెవి అక్కడే పెట్టి వెళ్లారు. సాయంత్రం ఆసుపత్రి నుంచి వచ్చిన విఠల్‌రెడ్డి.. పొలం పనులు ముగించుకుని భార్య, తల్లి ఇంటికి వచ్చారు. రాత్రి సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో ఎక్కడో పడి ఉంటుందని అనుకున్నారు. శుక్రవారం వెతకగా ఫోన్ కనిపించలేదు. అనుమానం వచ్చి అల్మారాను తెరిచి చూడగా నగదు, బంగారం చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. శుక్రవారం శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తనువు చాలించి.. శోకం మిగిల్చి

వేర్వేరు ఘటనల్లో ఆరుగురు ఆత్మహత్య

అనారోగ్య సమస్యలతో వృద్ధురాలు..

బెజ్జంకి(సిద్దిపేట): కడుపునొప్పి భరించలేక వృద్ధురాలు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈసంఘటన మండలంలోని తలారువానిపల్లె శివారులోని వెన్నవానిపల్లెలో జరిగింది. ఎస్ఐ నరేష్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాజనర్సవ్వ (85) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. రెండు రోజులుగా కడుపునొప్పి తీవ్రం కావడంతో శుక్రవారం ఉదయం ఇంటి వెనుక ఉన్న చెట్టుకు ఉరేసుకుంది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో యువకుడు..

దౌల్తాబాద్(దుబ్బాక): అప్పుల బాధతో యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని ఇందుప్రియాల్‌లో శుక్రవారం జరిగింది. ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తోట కుమార్(36) జీవనోపాధి కోసం అప్పు తీసుకొని గ్రామంలో దాబా ఏర్పాటు చేసుకున్నాడు. అది సరిగా నడవకపోవడంతో ఆర్థికంగా నష్టపోయాడు. దీంతో మనస్తాపానికి గురైన కుమార్ ఈనెల 9వ తేదీన రాత్రి దాబాలోనే పురుగు మందు తాగి పడుకున్నాడు. గురువారం ఉదయం స్నేహితుడు సాయిరాంగౌడ్ దాబాకు వెళ్లి చూడగా పురుగు మందు వాసన వచ్చింది. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీకి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మానసిక స్థితి సరిగా లేక వివాహిత..

పటాన్‌చెరుటౌన్: మానసిక స్థితి సరిగాలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన బాలమణి కూతురు గీత మాలిక (28)ను 2018లో రుద్రారంకు చెందిన ఆకుల అంజనేయులుకు ఇచ్చి వివాహం జరిపారు. వీరికి ఇద్దరు కుమారులు జన్మించారు. ఏడాది కాలంగా అంజనేయులు కుటుంబంతో కలసి ఇంద్రేశంలో ఉంటున్నాడు. కొన్ని రోజులుగా గీత మాలిక అలియాస్ నిఖి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఆస్పత్రిలో చూపించారు. ఈక్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంటికి వచ్చిన భర్త తలుపు తీసే ప్రయత్నం చేయగా లోపల గడియపెట్టి ఉంది. కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ విఫలమై.. మనసు వికలమై..


శ్రీరామ్(ఫైల్)

చేగుంట(తూప్రాన్): ప్రేమ విఫలమై మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అనంతసాగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోనగిరి శ్రీరామ్ (22) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈక్రమంలో ఓ యువతి ప్రేమలో పడ్డాడు. విఫలం కావడంతో గురువారం రాత్రి గ్రామ శివారులోని నల్లకుంటలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం కుంటలో శ్రీరామ్ మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ హరీశ్ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. .

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..


రాజు(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని శాలిపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మాలే రాజు (30) ఆర్థిక ఇబ్బందులతో గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధితుడి భార్య హేమలత శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహేతర సంబంధం అంటగట్టారని..


అన్నపూర్ణ (ఫైల్)

దౌల్తాబాద్(దుబ్బాక): వివాహేతర సంబంధం అంటగట్టారని మనస్తాపం చెందిన మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘంటన మండల పరిధిలోని ఉప్పరపల్లిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. ఈనెల 10వ తేదీన గ్రామానికి చెందిన ద్యావనబోయిన కల్పన పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకోగా శుక్రవారం దహన సంస్కారాలు నిర్వహించారు. కాగా కల్పన భర్తతో అదే గ్రామానికి చెందిన కారింగుల అన్నపూర్ణకు అక్రమ సంబంధం ఉండడంతోనే కల్పన మృతి చెందిందని ఆమె తరుపు బంధువులు దూషించారు. దీంతో మనస్తాపానికి గురైన అన్నపూర్ణ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలి భర్త నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.